# ఎక్కడున్నావు గొంగళీ

సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ

సగం సగం కన్న కలల్ని జోకొట్టుతూ

గొంగళీ పురుగు నిద్రపోయింది (తిలక్)

దాని పేరు సుబ్బారావు కావచ్చు. ఆనందరావు కావచ్చు. వీరేశ్వరరావో, కోటేశ్వరరావో కూడా కావొచ్చు.

కథా గమనం కోసం వెంకట్రావని పిల్చుకుంటే ఎవరకీ అభ్యంతరం ఉండనవసరం లేదు.

వెంకట్రావు పకపకా నవ్వేడు. పగలబడి నవ్వేడు. విరగబడి నవ్వేడు పొట్టచెక్కలయ్యేలాగానూ, పేగులు మెలితిరిగిపోయేట్టుగానూ నవ్వేడు.

ఆ తెల్లవారుఝామున ఒంటరిగా తన గదిల్లో మడతమంచం మీద పడుకుని నిద్రముఖంతోనే నవ్వేడు. గది తలుపులు బిగించుకుని వుండడంచేత ఇంకా ఎవరూ ఆ గది ఛాయలకి రాకపోవడం చేత వెంకట్రావు నవ్వినా ఎవరూ ఆశ్చర్యపోవలసిన అవసరం పడలేదు. అపార్థం చేసుకునే అనర్థం జరుగలేదు.

నవ్వి నవ్వి అలిసిపోయేక 'హమ్మయ్య' అనుకున్నాడు వెంకట్రావు. 'భలే కలొచ్చిందిస్మీ' అనుకున్నాడు. ఆ కలలో తనకొచ్చిన ఆలోచన గుర్తొచ్చి అతని ముఖం చేటంతయింది. తనలా ఆలోచించగలగడం తనకే అబ్బురమనిపించింది. తన కలనీ, కలలో ఆలోచననీ ఎవరితోనయినా చెప్పుకోవాలనిపించింది. కానయితే- ఎవరికి చెప్పుకున్నా తననో వింతజంతువుని చూసినట్టు చూస్తారనీ, వీర అజ్ఞానిగా ముద్రవేసి అపహాస్యం చేస్తారనీ భయం వేసింది. మళ్లీ మునగదీసుకుని, ముసుగేసుకుని, కళ్ళు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించేడు.

సగం సగం కన్న కలని నెమరేస్తూ, సగం సగం కన్న కలని జోకొట్టుతూ-

వెంకట్రావు ఎందుకు నవ్వినట్టు? కథ కాస్త వెనక్కి జరిపితే కాని తెలీదు చూద్దాం-

* * *

ఇంతకీ వెంకట్రావు ఎలిమెంటరీ స్కూలు టీచరు. దేశానికి స్వాతంత్రం వొచ్చినేడాది పుట్టేడు. అయిదో పంచవర్ష ప్రణాళిక వేసినపుడు ఉద్యోగంలో ప్రవేశించాడు. దేశ జనాభాలో నలుగుర్ని పెంచేడు. రిటైరయిన తండ్రీ, రోగిష్టి తల్లీ, గుండెలమీద కుంపట్లూ, చదువుల పేరిట వేధించుకు తినే తమ్ముళ్లూ- షరామామూలే.

భయాలచాటున, ఏడుపుకొండలమాటున

గుమాస్తాలు టీచర్లు చిన్న చిన్న సంసారులు

కోటీశ్వరరావులు, వీరేశ్వరరావులు గొంగళీపురుగులు.

లక్షలు, లక్షలు -

వెంకట్రావు కూడా వారిలో ఒకడే-

ఉద్యోగం చేస్తున్న ఊళ్లో సరైన అద్దె కొంప దొరక్క - దొరికినా రెండు సంసారాలను యీడ్చే తెగింపులేక- భార్యాపిల్లల్ని సొంతవూళ్లో తండ్రిగారి వద్ద వుంచేసేడు. సొంతవూళ్లో పెంకుటిల్లూ, పుట్టెడు అప్పూ వుండనే వున్నాయి.

సొంతవూళ్లో-

ముసలి అమ్మా, పాతమంచం కోడూ, చిన్నబ్బాయి, చెరువులో కొంగా- అంతా క్షేమం.

వెంకట్రావు ఒక తండ్రికి మంచి కొడుకు. ఒక తల్లికి మంచిబిడ్డ. ఒక భార్యకు, తమ్ముళ్లకూ చెల్లెళ్లకూ, తన పిల్లలకీ మంచిభర్త, మంచి అన్న, మంచి నాన్న.

లోకం మంచిదని నమ్మేంత మంచివాడు.

మంచిగావుంటే మంచే జరుగుతుందని ఆశించే మంచివాడు.

అయితే అతనికి మంచి జరిగిన దాఖలాలెప్పుడూ కనిపించలేదు.

ఇంట్లో దరిద్రం, తల్లిజబ్బూ, పెళ్ళికాని చెల్లెళ్లూ, ఉద్యోగాలురాని తమ్ముళ్లూ, కర్మఫలం కాకపోతే మరేఁవిటి?

మహారాజశ్రీ నాన్నగారూ, డి.ఎ. కిస్తీలు పెరిగే వరకూ మీకు నెలనెలా పంపించే మొత్తాన్ని మరింక పెంచలేను-

మహాలక్ష్మీసమానురాలైన అమ్మా, డబ్బులకి సరిపడా మందులూ, మందులకి సరిపడా జబ్బులూ సరిపెట్టుకోవే అమ్మా-

'నేనూ, పిల్లలూ, ఆయనా- ఎంత ఇరుకయినా ఫరవాలేదు- ఒక్క చూరుకింద- ఎప్పటికి తండ్రీ?' అని రాత్రివేళ కన్నీళ్లు కార్చే తలదిళ్లను కావలించుకునే, శ్రీమతీ- కొన్నాళ్లు, బహుశా కొన్నేళ్లు ఓర్చుకో-

వీధి గుమ్మం దాటి యింట్లోకిరాని భవిష్యత్తునీ, బద్దలవుతున్న వర్తమానాన్నీ, వ్యక్తమవుతున్న మానాన్నీ- కళ్లగూళ్లలో ఆశలదీపాలు వెలిగించుకుని ఎదురుతెన్నులు కాచే చెల్లెళ్లూ- 'కక్కొచ్చినా, కళ్యాణం వొచ్చినా ఆగదమ్మా, నా బంగారు కొండల్లారా రెండోది వచ్చేదాకా మొదటిది రాకుండా చూసుకోండమ్మా-

ప్రియమయిన పిచ్చి తమ్ముళ్లూ- మీ అర్హతల వలలకి సులాల చిల్లులు పడ్డాయ్. ఉద్యోగాల చేపలింక ఆ వలల్లో పడవుకానీ- ఇల్లొదిలి పారిపోకూడదూ? ఎక్కడో ఏదో మొహం నాలో చూసుకోండ్రా-

అని ఎప్పుడయినా యింటికి ఓ ఉత్తరం అందర్నీ ఉద్దేశించి రాసి పడెయ్యాలనిపిస్తుంది వెంకట్రావుకి.

రాయలేదు. అలా వ్రాయలేనంత మంచివాడు వెంకట్రావు.

బాధ్యతలు మొయ్యడమే తప్పు. నవ్వడం మరిచిపోయిన వెంకట్రావు మరెందుకు నవ్వినట్టు? జవాబు యింకా చెప్పవలసే వుంది.

* * *

వెంకట్రావు నవ్వడానికీ, దేశంలో ఎన్నికలు రావడానికీ సంబంధం వుంది. క్షమించండి. ఎన్నికలంటే అంత నవ్వులాటగా వుందా అని కోప్పడకండి.

దేశంలో త్వరలో ఎన్నికలు జరుగుబోతున్నాయన్న ప్రకటన వినగానే, ఎవరి సంగతి ఎలావున్నా వెంకట్రావు గుండెల్లో రాయి పడింది. చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోయేడు. దెయ్యాన్ని చూసిన వాడిలా తడారిపోయేడు.

'భగవంతుడా, మళ్లీ ఎన్నికలా!' అనుకున్నాడు బెంగబెంగగా.

అతని చిన్నప్పుడు ఎన్నికలంటే ఒక తమాషా. ఒక సరదా. నాటుబళ్లమీద మైకుల హోరు. రంగుల కాగితాలు- తెల్లని గోడలమీద చక్కని రాతలు- అమ్మచెయ్యి పుచ్చుకుని ఓటు గదిలోకి- ఓ వింతలోకంలోకి వెళ్లడాలు.

ఎన్నో రంగురంగుల కాగితాలు- వింతవింత గుర్తులున్న కాగితాలు- నిక్కరు జేబుల్లో గుసగుసలాడేవి.

ఊరంతా పెళ్లివారి విడిదిలా వుండేది.

ఎవరు గెలిచేవారో తెలీదు. ఏం జరిగిందో అతనికక్కరలేకపోయేది. శివరాత్రి సంబరాల కోసం, ఎన్నికల కోలాహలం కోసం ఒక్కలా అతను ఎదురుచూసేవాడు.

బాల్యంలో ఎన్నికలు అతనికి ఆశ్చర్యం. యుక్తవయసు వచ్చేక ఎన్నికలు అతనికి ఆశాలేశాలు.

అనూహ్యమయిన మార్పులేవో ఎన్నికలతో వొచ్చిపడతాయని ఆశించేవాడు. మంచిచెడుల బేరీజు వేసుకుంటూ మంచి నిలవాలని, గెలవాలని గుర్తొచ్చిన దేవుళ్లందరినీ కోరుకునేవాడు. ఏ వేల్పులూ అతని మొర ఎప్పుడూ వినలేదు.

నలభయ్యో పడిలో పడ్డాక వెంకట్రావుకి ఎన్నికల నగ్నస్వరూపం పూర్తిగా దృగ్గోచరమయింది.

అదొక అబద్ధాల మడుగని బోధపడిపోయింది. అవకాశవాదుల కుట్ర అని తెలిపోయింది.

క్రమంగా అతనీ అవమానకరమయిన అసత్యానికి అలవాటుపడిపోయేడు.

ఎన్నికల వాగ్దానాలకి ఎన్నడో స్పందించడం మానేసాడు. నాయకుల ఉపన్యాసాలు అతన్ని కదిలించలేవు. ఏదో జరుగుతుందన్న ఆశ ఏప్పుడో అడుగంటిపోయింది. ఎన్నికలు డబ్బున్న వాళ్ల క్రీడ అని అర్థమైపోయింది.

అంచేత వెంకట్రావుకి ఎన్నికలంటే ఆసక్తి ఎంతమాత్రం లేకుండాపోయింది.

అయితే-

ఎన్నికలంటే అతనికి భయం. ఎంత భయం అంటే- అతనికదొక అపస్మరణ సమస్యలా అనిపిస్తుంది. ఎన్నికలంటే- విరుచుకుపడే ఉప్పెన, కాటెయ్యబోయే కాలనాగు.

ఎన్నికలంటే వెంకట్రావు అంతగా భయపడిపోవడానికి కారణం ఏమిటి ?

అతను ఎన్నికల బరిలోకి దిగాల్సిన రాజకీయవాదా ?

కాదు.

పోనీ ఎవరి పక్షానయినా ప్రచారం చేయాల్సిన కార్యకర్తా ?

కాదెంతమాత్రం కాదు.

మరయితే ఏమిటి ?

కేవలం- అతను ఎన్నికల నిర్వహణకి నియమింపబడే పోలీంగు సిబ్బందిలో ఒకడు. అంతే.

గత ఎన్నికలలో పోలింగ్ ఆఫీసరుగా అతనికి ఎదురయిన చేదు అనుభవాలని అతనింకా మరిచిపోలేకపోతున్నాడు. ఆ అనుభవాల పీడకలలు అతనినింకా వెంటాడుతున్నాయి.

ఎన్నికల వికృత స్వరూపం-

అల్లర్లూ, గృహదహనాలు దాటి- బలప్రదర్శనలూ, రిగ్గింగుల రాక్షస పోరాటాలు మీరి- కార్యకర్తల హత్యలూ, మూకుమ్మడి ముట్టడులూ అధిగమించి- ఇప్పుడు ఎన్నికల సిబ్బందికి ప్రాణ సంకటంగా పరిణమిస్తోంది.

ఎన్నికల సిబ్బంది ప్రాణాలకు హామీలేదు.

జీతాలకి జీవితాన్ని పణంపెట్టి వూడిగంచేసే ఉద్యోగి భవిష్యత్తుకి భద్రతలేదు. రక్షణ లేదు.

ఎన్నికల బూత్‌లు రణరంగాలుగా మారుతున్నవేళ- పడగవిప్పిన దురహంకారాల ముందు రక్షక భటులు నిరుత్తరులై నిలబడిపోవాల్సినవేళ-

ఈ ఉద్యోగాలొద్దు తండ్రీ-

ఈ ఎన్నికల అగ్నిగుండాలెందుకు తండ్రీ-

నోటు మీది ఓటు మీది. అధికారం మీది. అందలం మీది. మీలో మీరు పంచుకోండి. మమ్మల్నెందుకు మధ్యన సమిధలుగా చేస్తారు సార్ ?

ఒక ఎన్నికల అధికారి తల వూరవతల నక్కలకోనలో ఎందుకుపడి పొర్లాలి ?

ఒక పోలింగు ఆఫీసరు చెయ్యి ఎవరు మాత్రం ఎందుకు నరికెయ్యాలి?

ఈ బాంబుల దాడి ప్రభావం- ఈ దౌర్జన్యాల పరిణామం- విధుల నిర్వహణకి సిద్ధమయిన మామీదే కాదు- మమ్మల్ని నమ్ముకుంటున్న వాళ్లమీద కూడా.

ఏః కత్తుల బోను ఎవరు తెరిచారు ? ఈ విషాన్ని ఎవరు వడ్డించేరు ? ఎవరయ్యా దీనికి జవాబుదారు?

* * *

ఈ దేశంలో-

ధరలు ఎప్పటికీ నేలమీదకి రావు.

యువతకి ఏ ఉద్యోగాలూ రావు.

అవినీతీ, బంధుప్రీతి, లంచగొండితనం- మానవ విద్వేషాలూ ఒక కొలిక్కి రావు.

కాని- ఎన్నికలు మాత్రం వొచ్చి పడుతూనే వుంటాయి.

ఎన్నికల ప్రకటన వెలువడినప్పుడల్లా వెంకట్రావులు జడుసుకుంటూనే వుంటారు. భయంతో తల్లడిల్లిపోతూనే వుంటారు.

అదే జరిగిందిప్పుడు

మళ్లీ ఎన్నికలు. అరాచక శక్తుల పండుగదినాలు. వెంకట్రావు గుండె చిద్రువలై పోయింది.

తనని పోలింగు ఆఫీసరుగా అపాయింటుచేస్తూ ఎన్నికల అధికారి పంపిన ఉత్తర్వులు అందుకుని బ్రమాన్పడిపోయేడు.

అపాయంటుమెంటు ఆర్డరులో తను పనిచేయాల్సిన పోలింగు కేంద్రం గల వూరిపేరు చదువుకుని నిలువుగుడ్లు వేశాడు. వజ వజ వణికిపోయేడు.

ఇది తప్పించుకోలేని అపాయం.

ఆ వూరొక విద్వేషాల పుట్ట. కలహాల గుట్ట.

దేశంలో అన్ని మూలలూ రాజకీయ కక్షల అంటురోగంతో పుచ్చిపోయేయి.

ఈ జనాలకి లక్షసమస్యలకన్నా, తక్షణ జీవితావసరాల కన్నా ప్రధానమయి పోయేయి రాజకీయాలు.

ఎలక్షన్ అపాయంటుమెంటు ఆర్డరు అందుకున్న రోజు వెంకట్రావుకి తిండి సహించలేదు. కంటికి నిద్ర సరిగా పట్టలేదు.

మగత నిద్రలో పీడకలలు పిశాచాల్లా వెంటాడేయి.

ఎన్నికల బూత్‌లో మంటలు పాముకోరల్లా సాచినట్లూ- కపాలాలు ఎందుకో 'ఫెటేల్' మని పోతున్నట్టూ- రక్తం వరదలై ముంచెత్తుతున్నట్టూ-

ఎన్నికలలో!

వెంకట్రావు శరీరం భయంతో తడిసి ముద్దయింది. ఇరుకు గదిలో వూపిరి నిలిచిపోతున్నట్టయింది. మంచి నీళ్లు తాగి మళ్లీ నిద్రకి ఉపక్రమించేడు.

అతి కష్టం మీద ఎప్పటికో రాత్రి నాలుగో ఝామువేళ చిన్న కునుకు పట్టిందతనికి.

అదిగో!

అప్పుడొచ్చింది వెంకట్రావుకి ఆ ఎంచక్కని కల! కమ్మని కల! హమ్మయ్య! అని నిబ్బరంగా నిట్టూర్చగల వింతకల-

ఇక దేశంలో ఎన్నికలుండవు. కొట్లాటలు లేవు. రిగ్గింగులూ, బాంబు దాడులూ లేవు. కోట్లాది ప్రజాధనం మంచి నీళ్ళలా ఖర్చుకావడం జరుగదు. కుట్రలూ, కుహకాలూ వుండవు-

మరేమిటి జరిగేది?

ఎన్నికలు లేక, పాలకవర్గం లేకపోతే, అయ్యో నా ప్రజలేమైపోవాలి? దేశం ఏ గంగలో దూకాలి?

కలలోనే సమాధానం దొరికింది వెంకట్రావుకి.

మహా ఆశ్చర్యకరమయిన ఎన్నికల విధానం!

ఏమిటిసార్ అది?

దేశంలో అన్ని స్థాయిల్లోనూ, అన్ని పదవులకూ ఎన్నికలు సరిగ్గానే జరుగుతాయి. కానయితే బ్యాలెట్లూ, పోలింగూ వుండదు.

గడువు తేదీ లోగా సీలువేసిన టెండర్లు నాయకులు పంపించుకోవాలి. దేశం మొత్తం మీద ఒకేసారి, ఒకే సమయంలో అధికారులు టెండర్లు తెరుస్తారు. ఎవరు హెచ్చు మొత్తంలో టెండరు పెడితే వారిదే గెలుపు. సర్పంచు పదవి మొదలు అత్యున్నత పదవి వరకూ ఇదే పద్ధతి.

టెండర్ల సొమ్ము ప్రభుత్వ ఖజానాకూ, ఆ తర్వాత దేశాభివృద్ధి పనులకూ ఖర్చు పెట్టబడుతుంది.

మనలో మనమాట- హెచ్చు మొత్తం టెండరుతో పదవి సంపాదించిన నాయకుడు తన పదవీకాలంలో ఆ సొమ్ము ఎలాగూ సంపాదించుకోవచ్చు.

ఇప్పటిలాగే అప్పుడూ డబ్బున్నవాడిదే అధికారం.

ఓం శాంతిః శాంతిః శాంతిః

* * *

కల చెరిపోయింది. ఎవరికీ చెప్పుకోలేని, చెప్పరాని కల! తన కొచ్చిన కల గుర్తొచ్చి వెంకట్రావు పగలబడి నవ్వసాగేడు. విగబడి నవ్వేడు. పొట్ట చెక్కలయ్యేలాగానూ, పేగులు మెలితిరిగి పోయేట్టుగానూ నవ్వేడు.

నవ్వి నవ్వి అలిసిపోయేక, మళ్లీ మునగదీసుకుని ముసుగేసుకుని, కళ్లు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించేడు.

సగం సగం కన్న కలల్ని నెమరేస్తూ, సగం సగం కన్న కలల్ని జోకొట్టుతూ-

(ఈనాడు . ఆదివారం . 3.2.1991)